టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా బి.లక్ష్మీరాజ, కార్యదర్శిగా విశ్వనాథ్

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లా ఎలిమెంటరీ అండ్ సెకండరీ స్కూల్ టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా బి.లక్ష్మీరాజ, ఉపాధ్యక్షుడిగా శ్యాంసుందర్‌రెడ్డి, కార్యదర్శిగా సి.విశ్వనాథ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి ఎల్ల వేళలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డైరెక్టర్లుగా ఎల్.బాలశౌరిరెడ్డి, కె.శ్రీనివాసులు, ఎస్.గురుకుమార్, సయ్యద్ ఇక్బాల్, వెంకటేశ్వర్ రెడ్డి, బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహా దేవరెడ్డి వ్యవహరించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక లోకం

- అట్టహాసంగా సిఐటియు జిల్లా మహాసభలు ప్రారంభం
- ర్యాలీ, బహిరంగ సభ
- కార్మికుల హక్కులు కాలరాసిన మోడి
- హామీలను విస్మరించిన జగన్
- కార్మికులకు అండగా సిఐటియు
- భవిష్యత్తులో పోరాటాలు, ఉద్యమాలు ఉధృతం
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బాలకాశి

బహిరంగ సభలో మాట్లాడుతున్న నాయకులు

బహిరంగ సభకు హాజరైన మహిళా కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఐటియు 9వ జిల్లా మహాసభల సందర్భంగా నగరంలో కార్మికులు కదం తొక్కారు. దీంతో నగరం ఎరుపెక్కింది. గురువారం మహాసభల సందర్భంగా ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ర్యాలీ కడప కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమై కోటిరెడ్డి సర్కిల్, జియోన్ కళాశాల, ఎన్‌టిఆర్ సర్కిల్, ఏడురోడ్ల కూడలి మీదుగా పాత కలెక్టరేట్‌కు చేరుకుంది. డప్పులు, బాణా సంచాల పేళుల్ల మధ్య ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. అన్నిరకాల కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా నాయకులు అభివాదం చేశారు. బహిరంగ సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బాలకాశి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. బ్రిటీష్ కాలంలో సాధించుకున్న హక్కులను రద్దు చేశారని తెలిపారు. కనీసం వేతనం రూ.26 వేలు ఉండాలని కేంద్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్రమే అమలు చేయడం లేదని విమర్శించారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ అధికారంలోకి రాగానే మరచిపోయారని చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తూ వారి కుటుంబాలకు పెన్షన్, తెల్లరేషన్ కార్డు తొలగించడం దారుణమని పేర్కొన్నారు. ప్రజలు 2024లో బటన్ నొక్కి ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డికి, జగన్‌రెడ్డికి ఏ కోశానా పాలనలో పోలికలు లేవని పేర్కొన్నారు. సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని రకాల పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి జగన్ పేద ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో మోడి, జగన్‌ను గద్దె దించకపోతే ప్రజలపై మరిన్ని భారాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి బి.నారాయణ, వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.ఎన్.సుబ్బమ్మ, బిఎస్ఎన్ఎల్ ఇయు జిల్లా అధ్యక్షులు కళ్యా సుధాకర్, ఎల్ఐసి డివిజన్ యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, ఎ.రఘునాథరెడ్డి, ప్రజా సంఘాలు, కార్మికులు, మున్సిపల్, అంగన్ వాడీ, ఆశా, మధ్యాహ్న బోజన కార్మికులు, ఐఎంఎల్ గోడౌన్ కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక పోరాటాలు ఉధృతం

కార్మిక చైతన్య యాత్రలో సిఐటియు రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్, రమాదేవి

ప్రజాశక్తి -కడప అర్బన్

చైతన్య యాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు రాబోయే రోజుల్లో కార్మిక పోరాటాలను మరింత ఉధృతం చేయనున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కటారి అజయ్‌కుమార్, దయా రమాదేవి పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర మహాసభ జయ ప్రదం కోసం ఈ నెల 28న కుప్పంలో ప్రారంభమైన కార్మిక చైతన్య యాత్ర గురువారం కడపకు చేరుకుంది. చైతన్య యాత్ర ప్రచార వాహనాన్ని సిఐటియు జిల్లా మాజీ కార్యదర్శి బి.నారాయణ, ఎల్ఐసి యూనియన్ డివిజన్ కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి బాలికల జూనియర్ కళాశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు.. యాత్రలో సిఐటియు రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో షెడ్యూల్ కార్మికుల వేతనాలను సవరించేందుదకు కనీసం కనీస వేతన సలహా కమిటీని ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వానికి ఏ మాత్రం భారమయ్యేది కాకపోయినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. తద్వారా ప్రయివేటు సంస్థల యాజమన్యాలు కనీస వేతనాలను నామ మాత్రంగా ఇస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనున్న పరిశ్రమల్లో కేవలం ఆరేడు వేల రూపాయలు మాత్రమే వేతనమిస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని వైసిపి అధికారంలోకి వచ్చి తొలినాళ్లలో సిఐటియుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇప్పటి వరకు కనీస వేతన సలహా కమిటీని ఏర్పాటు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి లేబర్ కోడ్స్‌గా మారుస్తోందన్నారు. చైతన్య యాత్ర 2023, జనవరి వరకు యాత్ర ఉంటుందని పేర్కొన్నారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలు భీమవరంలో జనవరి 2,3,4 ఉంటాయని తెలిపారు. 2న భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కార్మికులు, నాయకులు పెద్దఎత్తున హాజరు కావాలని పిలుపు నిచ్చారు.

ప్రొద్దుటూరులో జీపు జాతా

ప్రొద్దుటూరు : జిల్లా సిఐటియు మహాసభల సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలో జీపుజాతా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వరూపరాణి మాట్లాడుతూ కార్మికుల పట్ల అటు కేంద్రంలోని బిజెపి, ఇటు రాష్ట్రంలోని వైసిపి ప్రభు త్వాలు రెండు నాల్కుల ధోరణిగా వ్యవహ రిస్తున్నాయని విమర్శించారు. హిందూపురంలో గార్మెంట్ కార్మికులకు రూ.7వేలు వేతనం అందతోందని కర్నాటకలో రూ.15వేలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం తగదన్నారు. 15 సంవత్సరాలుగా కనీసవేతనం అమలు చేయడంలేదన్నారు. కార్మికులు, ఉద్యోగులకు నవరత్నాలు అందక, కనీసవ వేతనం మంజూరు కాక ఇబ్బంది పడుతు న్నారని చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ జనవరి 2,3,4 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సిఐటియు రాష్ట్ర మహాస భలుంటాయని చెప్పారు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నరసింహరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించే మహాసభలను విజయంతం చేయాలని కోరారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు ఓబులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ కార్మిక ద్రోహి అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ మున్సిపల్ కార్మిక నాయకులు చంటి, సాల్మన్, విద్యుత్ కార్మిక సంఘ నాయకులు ఓబులేసుతో పాటు స్థానిక కార్మిక నాయకులు,మహిళా నాయకులు పాల్గొన్నారు.

జానీస్ ఫ్యాషన్ వరల్డ్ ప్రారంభం

కడప అర్బన్ :నగరంలోని వై.వి స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన జానీస్ ఫ్యాషన్ వరల్డ్‌ను మాజీ డిప్యూటీ మేయర్ ఆరిపుల్లా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూడకుండా ఉపాధి మార్గాలు ఎంచుకోవడం అభినందనీ యమన్నారు. షోరూమ్ యజమాని అబ్దుల్లా మాట్లాడుతూ తమ షాప ్రరూమ్‌లో అన్ని రకాల దుస్తులు పిల్లలు, పెద్దలకు సంబంధించిన షర్టు, టీషర్టులు, ఫ్యాంట్లు లభిస్తాయని చెప్పారు. 30 ఏళ్లుగా ప్రజలకు నాణ్యమైన దుస్తులు అందించి మన్ననలు పొందుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనిఫ్, జుబేర్, గౌస్ పీర్, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఛాంపియన్ జట్టుతో అతిధులు

యువకులు క్రీడల్లో ముందుండాలని హజ్ కమిటీ చైర్మన్ గౌసులు ఆజాం పిలుపునిచ్చారు. గురువారం కెఒఆర్ఎం. క్రికెట్ గ్రౌండ్‌లో విజయ్ ట్రోఫీ 2022 ఫైనల్ మ్యాచ్ నిర్వ హించారు. గురువారం ముగింపు మ్యాచ్‌కు ఆంధ్ర ప్రదేశ్ హజ్ కమిటీ చైర్మెన్ ఆజాం, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆజం మాట్లాడుతూ ట్రోఫీ నిర్వహించిన కడప నైట్ రైడర్స్ అధ్యక్షుడు యం.తారిఖ్ అలీ, వారి మిత్ర బృందానికి అభినందించారు. అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ క్రిడాకారులు క్రీడా స్ఫూర్తితో ఇలాగే ముందుకు సాగాలని కోరారు. విజయ్ ట్రోఫీ 2022 సింగిల్ మ్యాచ్ ఛాంపియన్ షిప్ హోరాహోరీగా సాగింది. స్పీడ్ స్టార్ జట్టు తరపున 72 బంతుల్లో 106 పరుగులు చేసిన నగేష్ కి మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్ అందజేశారు. అలాగే టోర్నమెంట్‌లో మంచి ప్రదర్శన చేసిన లియో స్టార్స్ ఆల్ రౌండర్ ప్రశాంత్‌కి మ్యాన్ ఆఫ్ దీ టోర్న మెంట్ అవార్డు దక్కింది. కార్యక్రమంలో తారిఖ్ అలీ, ఐపిఎల్, రంజీ క్రీడా కారుడు పైడికాల్వ విజయ్ కుమార్‌తో పాటు ముఖ్య అతిథులు డాక్యుమెంట్ రైటర్ జీ.నాగేంద్ర, డాక్టర్ అవ్వరు అర్జున్‌కుమార్, అమీన్ హాస్పిటల్ ఎం.డి. షేక్ నయీం, వైసిపి నాయకులు కల్టెక్స్ హాఫీజుల్ల, సుకుమార్‌మారే, కెకెఆర్ సభులు బాలాజీ రెడ్డి, సమిఉల్ల, అంజద్, జీలాన్ పాల్గొన్నారు. అనంతరం ఛాంపియన్లుగా నిలిచిన స్పీడ్ స్టార్స్, రన్నర్లుగా నిలిచిన లియో స్టార్స్ జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఎస్ఐ సేవలు అభినందనీయం

అట్లూరు : స్థానిక ఎస్ఐ చిరంజీవి సేవలు అభినందనీయమని వ్యాయమ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర బాధ్యులు కావేటి రమేష్ యాదవ్ పేర్కొన్నారు. కొండూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కర్నూల్‌కు బదిలీ అవుతున్న నేపథ్యంలో గురువారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17 నెలలుగా సేవలందించి బదిలీ అవుతున్న సందర్భంగా సన్మానించడం సంతోషంగా ఉందని చెప్పారు. మండలంలో ఎర్రచందనం అక్రమ రవాణా, నాటుసారా, గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయప్రసాద్, గౌరీశంకర్, గురుమూర్తి పాల్గొన్నారు.



ఎస్ఐని సన్మానిస్తున్న కావేటి రమేష్‌యాదవ్

వైసిపి పాలనలో ప్రజలు విలవిల

చెన్నూరు : వైసిపి పాలనలో అధిక ధరలు, పన్నుల భారంతో ప్రజలు విలవిలలాడుతున్నారని కమలాపురం టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌సి పుత్తానరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం చెన్నూరులోని సరస్వతి నగర్, శ్రీరామ్ నగర్, లక్ష్మీ నగర్ ప్రాంతాల్లో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడుతూ అధిక ధరలు, మద్యం, ఇసుక మాఫియా, ఇంకా అనేక సమస్యలతో రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సందరంగా అక్కడి ప్రజలు డ్రెయినేజీ లేదని తెలపడంతో టిడిపి ప్రభుత్వం వస్తే డ్రెయినేజీతోపాటు సిమెంట్ రోడ్లు వేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, రైతు నాయకుడు గుమ్మల మల్లికార్జున్ రెడ్డి, రామణ పల్లె బుజ్జిన్న, కె.చెన్నయ్య, గుమ్మల రామకృష్ణారెడ్డి, నారాయణ, కుందేటి కృష్ణయ్య, ఓబుల్ రెడ్డి, ఆవుల బసిరెడ్డి, బాలకృష్ణ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను విన్నవిస్తున్న మహిళ

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని చెన్నవరం గట్టు పైనున్న 1878, 18 79 సర్వే నెంబర్లలో దాదాపు 44 ఎకరాల భూమిని అదే ప్రాంతంలో విశ్రాంతి విఆర్ఒ నాగిరెడ్డి బినామీ పట్టాలు సృష్టించుకుని ఆక్రమించారని, ఆయనపై విచారించి బాధితులకు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ నాయకుడు కర్నాటి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన బాధితులతో కలసి ఆక్రమణ భూమిని పరిశీలించారు. తాము ముంపు వాసుల కింద చెన్నవరం నుంచి గట్టుపైకి వచ్చామని, పక్కన ఉన్న భూమిని ప్రభుత్వం తమల్ని తీసుకోమని చెబితే నాగిరెడ్డి అనే వ్యక్తి రెవెన్యూలో పనిచేస్తూ బినామీ పేర్లతో పట్టాలు పుట్టించుకుని ఆక్రమించుకున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన నాయకుడు తాము మీ పక్షాన న్యాయం జరిగే వరకూ పోరాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బారెడ్డి, సిపిఎం జిల్ల కార్యవర్గ సభ్యులు పోలయ్య, ఖాతా రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, సయ్యద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితులతో కలసి స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం రానివ్వం

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలోని నరసాపురం ప్రాంత ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం, ఇబ్బందులు రానివ్వమని ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తామని విద్యుత్ లైన్‌మెన్ రాజా పేర్కొన్నారు బుధవారం మండల కేంద్రంలోని నర్సాపురంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తులు ఎప్పటికప్పుడూ చేయించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటన సమాచారం ఇవ్వాలని వారు తెలిపారు విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పొదుపు చేసుకుంటూ వాడుకోవాలని అదేవిధంగా నెల వచ్చేసరికి విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు

సాంకేతికపరంగా ఎదగాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ట్యాబ్ అందజేస్తున్న ఎస్ఎస్ఎ పిఒ

విద్యార్థులు చదువుతోపాటు సాంకేతి కపరంగా ఎదగాలని, ఆట, పాటలు, మాటల్లో మంచి నైపుణ్యం సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ఉచిత ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజ నిర్దేశికులుగా ఒక ఉన్నత స్థానానికి ఎదగాలంటే వారికి చదువుతోపాటు ఆటలు, పాటలు ,మాటలలో నైపుణ్యం సాధజంచాలని చెప్పారు. ఆటల ద్వారా విద్యార్థులు మానసిక ఉల్లాసంతో పాటు ఒక బలమైన మనస్తత్వాన్ని పాజిటివ్ దృక్పథాన్ని ఏర్పరచుకోవచ్చని చెప్పారు. ప్రతి ఓటమీ విజయానికి నాందిగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ డిఇఒ, నాగమునిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లారెడ్డి, పాఠశాల ప్రత్యేక అధికారి భాషా మొహిద్దీన్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్ : బద్వేలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి చెట్టుపై నుండి కింద పడి తీవ్ర గాయాలపాలైన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పాఠశాల సమయంలో మధ్యాహ్నం 2.30 ని నుంచి 3.00 గంటల మధ్యలో పాఠశాల ఆవరణంలోని చెట్టు ఎక్కి పైనుండి కింద పడి తీవ్ర గాయాలు కావడంతో 108 సహకారంతో కడపకు తరలించారని, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వేలూరుకు తరలించారని తెలిపారు. పాఠశాల సమయంలో విద్యార్థి చెట్టు ఎక్కుతుంటే అక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. సంఘటన పాఠశాల సమయం అయిపోయాక జరిగిందని చెప్పడం దారుణమన్నారు. గాయపడిన విద్యార్థికి మెరుగైన చికిత్స అందించాలని, బాధిత విద్యార్థికి అయ్యే వైద్య ఖర్చు మొత్తం విద్యాశాఖ భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ నాయక్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత వాతావరణమే లక్ష్యం

ప్రజాశక్తి - బద్వేలు

చెత్తాచెదారం తొలగింపులో ఎన్‌సిసి కేడెట్లు

కాలుష్య రహిత వాతావరణమే భవిష్యత్ తరాలకు మనమిచ్చే వరమని రాచపూడి నాగభూషణం, డిగ్రీ, పీజీ కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకటసాయికృష్ణ పేర్కొన్నారు. పునీత్ సాగర్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి గర్ల్స్ బెటాలియన్, తిరుపతి పిఐ స్టాఫ్ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద చెరువులో వ్యర్థ పదార్థాలను తొలగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేడెట్స్ స్థానిక పెద్ద చెరువు సమీపంలో ఉన్న చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలను దాదాపు ఒక కిలోమీటర్ వరకు తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ, 5(ఎ) బెటాలియన్ స్టాఫ్ హవల్దార్ భరత్, సుబేదార్ దేవేంద్ర సింగ్, కళాశాల ఎన్‌సిసి ఆర్మీ హెచ్ ప్రియాంక, వై. వీరేంద్ర పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌కు సత్కారం

ప్రజాశక్తి కడప అర్బన్

చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా లింగాల ఉషారాణి పదవి బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిరు సత్కారం నిర్వహించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా గ్రంథాలయ కార్యదర్శి యస్.అమీరుద్దిన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో చైర్ పర్సన్ నిజాయితీగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి సమూల మార్పు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ పదవి స్వీకరించినప్పటి నుంచి వివిధ మునిసిపాల్టీల నుంచి రావాల్సిన మొత్తం రూ.3 కోట్లు వసూలు కావడం సంతోషంగా ఉంద న్నారు. రూ. 88 లక్షలతో కొత్త పుస్తకాలను కొను గోలు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లింగాల రామలింగారెడి ,లైబ్రేరియన్స్, యస్.సుబ్రమణ్యం . జూనియర్ అసిస్టెంట్, శ్రీనివాస చారి, టైపిస్ట్ ప్రదీప్ కుమార్ లైబ్రేరియన్స్ నవాబ్ జాన్, ఇబ్రహీం సాహెబ్, వెంకటేశ్వరమ్మ ,లక్ష్మినారాయణమ్మ, నాగాంజలి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, జిల్లాలోని ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో 'రాజోలి' బాధితుల వాగ్వావాదం

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎంఎల్ఎతో మాట్లాడుతున్న బాధితులు

రాజోలి జలాశయంలో నీటి నిల్వ విషయంలో సాక్షాత్తు జమ్మల మడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బాధిత రైతులు వాగ్వావాదం చేసుకు న్నారు. ఈ సంఘటన గురువారం కలెక్టరేట్ బయట చోటు చేసుకుంది. రాజోలి జలాశయం బాధితులతో కలిసి సుధీర్‌రెడ్డి కలెక్టర్ విజయరామరాజుతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో రాజోలి జలాశయంలో నీటి నిలువలు 2.95 టిఎంసిల నీరు ఉండేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి అనుకూలంగా అధికారులు బాధితులతో సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేసి నష్టపరిహారం కూడా చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన అనంతరం ప్రభుత్వం రాజోలి జలాశయంపై అంతర్గత సమావేశంలో ప్రాజెక్టులో నీటి నిలువల 2.95 టిఎంసిల నుండి 1.25 టిఎంస్లికు తగ్గించాలని ప్రభుత్వ ఆదేశించినట్లు సమాచారంతో రాజోలి బాధిత రైతులందరూ కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూడా రాజోలి ప్రాజెక్టు 1.25 టిఎంసి నీటి నిల్వ ఉండాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు కలెక్టర్ చెప్పారు. దీనిని ఆగ్రహించిన రైతులు ఎమ్మెల్యే సమక్షంలోనే ప్రభుత్వాన్ని తప్పు పట్టారు. రైతుల ఆగ్రహాన్ని సాకుగా తీసుకుని ఎమ్మెల్యే గ్రూపుకు చెందిన వారు, బాధితులు మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. రెండు గ్రూపులుగా విడిపోయిన బాధిత రైతులు పరస్పరం దూషించుకున్నారు. పోలీసులు రెండు గ్రూపులను శాంతింపజేశారు.

పింఛన్ల తొలగింపు అన్యాయం

కడప అర్బన్ : పేదల పింఛన్ తొలగింపు అన్యాయమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ అన్నారు. గురువారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వృద్ధులకు నోటీసులు ఇచ్చి వారిలోభయం సృష్టిస్తూ ప్రభుత్వం చోద్యం చూస్తుందని విమర్శించారు. ప్రభుత్వం ముందస్తు ఆలోచనతోనే పింఛన్లు తొలగించేందుకు జీవో నంబర్.174 2019 డిసెంబర్‌లోనే తీసుకొచ్చిందని చెప్పారు.ఈ జీవో ద్వారా అవ్వా, తాతలకు, అనాథలకు, ఒంటరి మహిళలకు, విభిన్న ప్రతిభావంతులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. 300 విద్యుత్ యూనిట్లు పైన ఉన్నా, నాలుగు చక్రాల వాహనం ఉన్నా, పెన్షన్ తీసివేస్తామని అధికారులు చెప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ బెస్త సాధికారత రాష్ట్ర అధ్యక్షులు యాటగిరి రామ్ ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి,నాయకులు దామోదర్, కలాం పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించిన 'నారాయణ' విద్యార్థులు

ప్రజాశక్తి- కడప అర్బన్

మార్చ్ ఫాస్ట్ లో నారాయణ స్కూల్ విద్యార్థులు

నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని నారాయణ స్కూల్ బ్రాంచ్ విద్యార్థులు క్రీడల్లో రాణించారు. గురు వారం మున్సిపల్ గ్రౌండ్‌లో జిల్లా వ్యాప్తంగా క్రీడా పోటీలు నిర్వహించారు. హౌసింగ్ బోర్డ్ బ్రాంచ్ విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబరిచారు. కడప, అన్నమయ్య జిల్లాల నుంచి విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించడం పట్ల ప్రిన్సిపల్ గీత హర్షం వ్యక్తం చేశారు. ఖోఖో, కబడ్డీ, క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను ఏజియం రాజు, ఆర్ఐ కిరణ్ కుమార్ అభినందిచారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా నారాయణ హైస్కూల్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

యువత ప్రణాళికతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



శిక్షణలో మాట్లాడుతున్న దీప్తి

యువత ప్రణాళికతో ముందుకెళ్లాలని జిల్లా ఉపాధి అధికారి పి. దీప్తి పిలుపునిచ్చారు. గురువారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నీహార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో యువతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కెరీర్ గైడెన్స్‌పై ఆమె మాట్లాడారు. యువత ప్రణాళికలు రూపొందించుకుని త ద్వారా మార్గాలు నివేదించుకోవాలని పేర్కొన్నారు. యువతకు ఉద్దేశించి పిపిటి ద్వారా ప్రెసెంటేషన్ ఇచ్చారు. విపత్తు నివారణ అంశాలపైనా అదనపు జిల్లా ఫైర్ ఆఫీసర్ బసివి రెడ్డి మాట్లాడుతూ యువత ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలి, ఎటువంటి పరికరాల ద్వారా ప్రమాదాలను ఎదుర్కొవాలి అంశాలపై రిహార్సల్స్ ద్వారా వివరించారు. మధ్యాహం సెషన్‌లో లీడర్‌షిప్ క్వాలిటీస్, లైఫ్ స్కిల్స్ పై హిస్టరీ ప్రొఫెసర్ గంగాధర్ యువతకు పిపిటి ద్వారా ప్రెసెంటేషన్ ఇచ్చారు. డాక్టర్ విశ్వనాథరావు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై యువతకు నైపుణ్యాలు మెలకువలు ఇంగ్లీష్ సంబాషణ, మాట్లాడే విధానాలు, వివేకానంద సూక్తులు వాటి పై అవగాహనా కలిగించారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి తెలిపారు. వేంపల్లెలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందివ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. పేద విద్యార్థులు కూడా కార్పోరెట్ విద్యను అభ్యసించాలని ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని కోరారు. పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలని కోరారు. కంప్యూటర్ రంగంలో కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌ల్లో విద్యకు సంబంధించిన విషయాలు ఉంటాయని, వాటిని నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ వీరారెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

చక్రాయపేట : సాంకేతిక విద్యపై ప్రతి విద్యార్థి పరిజ్ఞానం తెలుసుకోవాలని ఎంపిపి మాధవి బాలకృష్ణ, జడ్‌పిటిసి టి.శివప్రసాద్‌రెడ్డి సూచించారు. మండలంలోని నాగులాటపల్లె, మహాదేవపల్లె, చక్రాయపేట కెజిబివి, గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ముందుగా సిఎంజగన్ చిత్రపటానికి విద్యార్థుల తల్లిదండ్రులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త ఓబుల్‌రెడ్డి, ఎంఇఒ, ఆయా పాఠశాల చైర్మన్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సర్పంచు శ్రీనివాసులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంపిపి, జడ్‌పిటిసి

ఖాళీ చేయమనడం అమానుషం

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైన కె.సుగుమంచిపల్లి గ్రామంలో ఇళ్ల ఖాళీ చేయాలంటూ రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వడం అమానుషమని నాగు అమర్‌నాథరెడ్డి, ఎన్.ఆదినారాణరెడ్డి, పి.ఆదినారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ సుగుమంచిపల్లి గ్రామంలో 135 ఇళ్ల ముంపునకు గురికాగా. అందులో 185 పిడిఎఫ్ (ఆస్తులు కోల్పోయిన వారు)లు నిర్ధారించారు. మరో 80 పిడిఎఫ్‌లు గుర్తించాల్సి ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామంలో ఎలాంటి గ్రామసభ నిర్వహించకుండానే ఆనాటి నాయకులు, అధికారులు కుమ్మక్కై, ఒటిఎస్‌పద్ధతికి అంగీకరించడంతో గ్రామంలోని సామాన్య ప్రజలు నేడు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని, అర్హులైన వారికి పరిహారంతోపాటు పునరావాస సౌకర్యం కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ తర్వాతనే గ్రామాన్ని ఖాళీ చేస్తామని పేర్కొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి రాజోలి ప్రాజెక్టుపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కడప జిల్లా టిడిపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో స్టీల్ పరిశ్రమ, రాజోలి ప్రాజెక్టుపై జరిగిన చర్చలో వైసిపి నాయకులు తీవ్ర పదజాలంతో పెద్దముడియం మండలంలోని రైతులను మాట్లాడడం హేయమైన చర్య అన్నారు. 2.9 టిఎంసి సామర్థ్యంతో రాజోలి ప్రాజెక్టును నిర్మిస్తామని చెప్పి, ఇప్పుడు 1.2 టిఎంసికే పరిమితం చేస్తామనడం సమంజసం కాదన్నారు. రైతులు న్యాయంగా అడిగితే వైసిపి వారు దాడి చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించి హామీని నిలబెట్టుకోవాలని, రైతులకు చెప్పిన పరిహారాన్ని ఇచ్చి న్యాయం చేయాలని ఆయన కోరారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని జీవన జ్యోతి విద్యా సంస్థల అధినేత గురుదేవ్ రామిరెడ్డి సూచించారు. స్థానిక టి.కె.ఆర్ జీవన జ్యోతి పాఠశాలలో గురువారం లిటిల్ చాంప్స్ అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఫౌండర్ గురుదేవ్ రామిరెడ్డి మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న ప్రతిభా పాటవాలు బహిర్గతం అవుతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు డి.చిన్న గురుశేఖర్ మాట్లాడుతూ పిల్లల ప్రతిభను తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం అనేది ఒక మంచి కార్యక్రమన్నారు. లక్కీడిప్ ద్వారా 5 మంది తల్లిదండ్రులు బహుమతులు గెలుచుకున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం చేస్తున్న గురుదేవ్ రామిరెడ్డి

నిరుపయోగంగా మినరల్ వాటర్ ప్లాంట్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిర్రాజుపల్లి గ్రామ పంచాయతీలోని కర్చుకుంట పల్లిలో మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. గ్రామంలో ఆనాడు రాజ్యసభ సభ్యులుగా ఉన్న ఎం.వి.మైసూరారెడ్డి చొరవతో ఎంపీ నిధులను వెచ్చించి ఈ మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. ఇది కొన్ని ఏళ్ల వరకు గ్రామ ప్రజల దాహార్తిని తీర్చింది. అయితే మూడేళ్ల నుండి నిరుపయోగంగా ఉంది. ప్రస్తుత నాయకులు పట్టించుకోకనే ఇలా ఉందని పలువురు పేర్కొంటున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణలో విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో, దాని నిర్వహణ భారమైందని స్థానికులు అంటున్నారు. సురక్షిత తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు అంటున్నారు. చిలమకూరు నుండి ఆటోలో వస్తున్న సురక్షిత మంచి నీటి కోసం ఎదురు చూడవలసి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఆటోలు రాకపోతే ద్విచక్ర వాహనాల్లో చిలమకూరుకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి అని ప్రజలు వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే సొంత గ్రామమైన చిర్రాజుపల్లి గ్రామ పంచాయితీలోని ప్రజలు మంచినీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు పేర్కొంటున్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి నరేంద్రను వివరణ కోరగా.. కరెంటు బిల్లు సమస్యతోనే వాటర్ ప్లాంట్ మూసి వేయవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. స్థానికంగా ఉన్న కోరమండల్ సిమెంట్ ఫ్యాక్టరీ (ఐసిఎల్) యాజమాన్యాన్ని కలిసి పరిశ్రమ సిఎస్ఆర్ ఫండ్స్ వెచ్చించి వాటర్ ప్లాంట్‌ను మళ్లీ మనుగడలోకి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటికైనా నాయకులు మినరల్ వాటర్ ప్లాంట్ సమస్యపై శ్రద్ధ చూపి, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు వేగవంతం

- పనులు వచ్చే మార్చి నాటికి పూర్తి.. మేలో రంజీ పోటీల నిర్వహణకు సన్నాహాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందులలో 2023 మేలో రంజీ క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సన్నాహాలను ప్రారంభించింది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపురం సమీపంలో 14 ఎకరాల్లో రూ.53 కోట్లతో నిర్మిస్తున్న వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ స్టేడియం నిర్మాణ పనులను విబిఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఇంటర్నేషనల్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ దేశంలో క్రికెట్ స్టేడియం నిర్మాణంలో అత్యంత ప్రధానపాత్ర పోషిస్తుంది. పులివెందులలో నిర్మిస్తున్న వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను 2023 మార్చి చివరి నాటికి పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ వీరభద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ స్టేడియం పూర్తయితే 2023 మేలో బిసిసిఐ ఆధ్వర్యంలో పులివెందులలో రంజీ క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సన్నాహాలను ప్రారంభించినట్లు సమాచారం. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2005లో కడప రిమ్స్ సమీపంలో వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పులివెందులలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 ఎకరాల భూమిని కొనుగోలు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించారు. బివిఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత వీరభద్రారెడ్డి ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పరిశీలిస్తూ, నాణ్యతకు ప్రాధాన్యత నిస్తున్నారు. ఈ స్టేడియం నిర్మాణ పనులు పూర్తయితే క్రికెట్ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతోపాటు, రాష్ట్ర, దేశవాళీ క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఈ క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. పులివెందులలో క్రికెట్ స్టేడియం నిర్మాణంతో క్రికెట్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు చక్కటి శిక్షణ లభించనుంది.

వైఎస్ఆర్ క్రికెట్ స్టేడియం నమూనా

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - మైలవరం

పల్లె గోవర్ధన్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేపరాల గ్రామానికి చెందిన గోవర్ధన్, ఆయన భార్య వరలక్ష్మి మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఎమ్మెల్యే దొమ్మర నంద్యాలలో గురువారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మహత్య చేసుకున్న దంపతుల పిల్లలను పరామర్శించారు. వారికి అండగా ఉంటామన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేసి పిల్లల ఉన్నత చదువులకు, ఉజ్వల భవిష్యత్తుకు కావలసిన సదుపాయాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం తరపున వారికి బాసటగా నిలుస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులు, ప్రజలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో సచివాలయ నిధుల ద్వారా రూ.5లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. సచివాలయ నిధులతో అధిక ప్రాధాన్యత పనులకు వెంటనే అనుమతులు మంజూరు చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, వైస్ ఎంపిపి ఎన్.సుందరమ్మ, సర్పంచు జాన్సన్, వైసిపి నాయకులు రామ్మోహన్‌రెడ్డి, రమణయ్య, ప్రసాద్, జయరామిరెడ్డి, జయ సుబ్బారెడ్డి, పిఆర్ ఎఇ ఈశ్వరయ్య, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రైల్వేస్టేషన్ సమీపాన ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమానికి ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో మీ కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి పండుగ సందర్భంగా రూ.40వేల విలువ చేసే నిత్యావసర సరుకులు, దుప్పట్లు, పంచెలు, చీరలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ మాట్లాడుతూ ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారు తమ జీవనోపాధి కోసం, కువైట్ ఇతర దేశాలకు వెళ్లారన్నారు. వారి సంపాదనలో కొంత మొత్తాన్ని తమ మాతృభూమికి ఏదైనా చేయాలనే ఉద్దేశ్యంతో సభ్యులందరూ ప్రతి నెలా కొంత సొమ్ము పోగుచేసి సాయం చేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో భారత్ సైంటిఫిక్ అధినేత మఠం బాలు, మీ కోసం సేవా సంస్థ అధ్యక్షులు పుల్లగూర విష్ణువర్ధన్, ఆదరణ సేవా సంస్థ బైసాని సత్య నారాయణ, శ్రీ పాద శ్రీ వల్లభ అక్షయ సేవా సమితి అధ్యక్షులు కొండల భరద్వాజరెడ్డి, అమ్మ సేవా సమితి శివ శంకర్, వృద్ధాశ్రమ నిర్వాహకులు పొలిచెర్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

నిత్యం స్వచ్ఛత కార్యక్రమాలు : శానిటరి ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఎక్కడ కూడా అపరిశుభ్రతకు తావివ్వకుండా నిత్యం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని 20 వార్డుల్లో అనునిత్యం డ్రయినేజీ కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నామని తెలిపారు. రోడ్లపై చెత్తాచెదారాల్లేకుండా శుభ్రం చేస్తున్నామన్నారు. పట్టణంలోని మార్కెట్ రోడ్డులో, రామిరెడ్డిపల్లె వీధిలో, నాగులకట్ట వీధిలో, తాడిపత్రి రోడ్డులో డ్రెయినేజీ కాలువల్లో పూడికతీత చేపట్టామన్నారు. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రజలు కూడా తమవంతుగా పారిశుధ్యం పాటించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ శానిటేషన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజి కాలువలో పూడిక తీయిస్తున్న నూర్‌బాషా

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరులోని స్కాన్ సెంటర్లను ఆయన తన సిబ్బందితో తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణుల వివరాలను నమోదు చేయాలని, రికార్డులు ఖచ్చితంగా ఉండాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సూపర్‌వైజర్ వర ప్రసాద్ పాల్గొన్నారు.

స్కాన్ సెంటర్లను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

పోలీసుల జోక్యంతో స్వగ్రామం చేరిన మహిళ

మాట్లాడుతున్న సిఐ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

జీవనోపాధి కోసం మస్కట్ వెళ్లి, అక్కడ పని లేక, తిరిగి రాలేక ఇబ్బందులు పడుతున్న మహిళను పోలీసులు జోక్యం చేసుకుని స్వగ్రామానికి చేర్చారు. వివరాల్లోకి వెళితే.. ముద్దనూరు వెంకటరెడ్డి కాలనీకి చెందిన వెంకటసుబ్బమ్మ జీవనోపాధి కోసం ఏజెంట్ ద్వారా జూన్ నెలలో మస్కట్ వెళ్లింది. అప్పటి నుంచి పని లేక తిరిగి రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఆందోళనతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, మహిళను ఇండియాకు రప్పించాలని ఆమె భర్త, కుటుంబ సభ్యులు విషయాన్ని మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్‌తో కలిసి పోలీస్‌స్టేషన్‌లో సిఐ మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సిఐ స్పందించి ఏజెంట్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి వెంకటసుబ్బమ్మను మస్కట్ నుండి ముద్దనూరు రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సిఐ మోహన్‌రెడ్డి ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహిళ గ్రామానికి రావడంతో బాధితురాలు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సిఐ మోహన్‌రెడ్డికి, సుమంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

సంక్షేమ పథకాల అమలులో అర్హతే ప్రామాణికంగా తీసుకుని ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అమలుపరచడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. పచ్చ చొక్కా పార్టీ నాయకులకు కూడా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు గ్రామాల్లో ధైర్యంగా తిరుగుతున్నారంటే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందివ్వడమే కారణమన్నారు. ప్రస్తుతం పెన్షన్లను తొలగిస్తున్నారన్న టిడిపి నాయకుల్లో వాస్తవం లేదని తెలిపారు. అనర్హత ఉన్నవారికి నోటీసులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ సుభాని, ఎఒ మ్యాగీ, పిఆర్ ఎఇ ఈశ్వరయ్య, వైసిపి మండల కన్వీనర్ శేఖర్‌రెడ్డి, జడ్‌పిటిసి భర్త శాంతరాజు, సర్పంచు శ్రీవిద్య, నారాయణరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి బాల నరసింహారెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, జయరాజు, బోకుల కొండారెడ్డి, చంద్ర, సర్పంచులు కిషోర్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనువాసుల రెడ్డి, జయ సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి జాతీయ రహదారులకు భూ సేకరణపై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరిష పిఎస్, ఎన్‌హెచ్ఎఐ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎంత భూసేకరణ జరిగింది, ఇంకా ఎంత జరగాల్సి ఉంది, పరిహారం చెల్లింపు, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల జారీ తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. పెండింగ్ ఫైల్స్ గురించి ఆయా అంశాల వారీగా ఆర్డీవోలు, తహశీల్దార్లు, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలన్నారు. భూ సేకరణ ఫైల్స్ ఇ-ఆఫీస్ ద్వారా పంపాలన్నారు. పెండింగ్ ఫైల్స్ ఎప్పటికప్పుడూ పరిష్కారం అయ్యే విధంగా ఉన్నదాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సేకరించిన భూములకు సంబంధించి లబ్ధిదారులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

PASSPORT MISSING

I , CHIRALLAGARI VANI W / O . CHIRALLAGARI SUB-BARAYUDU , residing at room no. 985, Rajiv nagar colony, Gudemcheruvu, jammalamadugu , Y.S.R.Dist . , Andhra Pradesh- 516434 . Passport Bearing No.U8219590 , The Said Passport is not received by me and unable to trace it out , it is missing beyond recovery till this date .

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

రబీలో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని చింతకుంట, మంగపట్నం గ్రామాల్లో గురువారం రబీలో సాగుచేసిన జొన్న, మినుము, శనగ, ధనియాలు పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఎఒ రైతులతో మాట్లాడుతూ పంట నమోదుతో ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. పంట నమోదు చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపైనే ఉందన్నారు. చింతకుంట గ్రామంలో వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా అందించిన తిరుపతి 104 మినుము రకాన్ని సాగు చేసిన పంటను పరిశీలించామన్నారు. మంచి దిగుబడి కోసం రైతులకు తగిన సలహాలు ఇచ్చినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలిస్తున్న ఎఒ

పింఛను పునరుద్ధరణకు లబ్ధిదారుల అగచాట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పలువురి ఫించన్లు తొలగిస్తున్నట్లు ఆయా లబ్ధిదారులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ పరిస్థితుల్లో వారు పింఛన్ ఎందుకు రద్దు చేశారని ఆరా తీసేందుకు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు సచివాలయాలకు వెళ్లారు. అక్కడి సిబ్బంది మీకు విద్యుత్ బిల్లులు ఎక్కువ రావడంతో రద్దయ్యాయని, విద్యుత్ శాఖను సంప్రదించి బిల్లులను సరిచేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో వారు విద్యుత్ అధికారుల వద్దకెళ్లి వారి సమస్యలను వివరించారు. అయితే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా మాకు సంబంధం లేదు.. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని చెబుతున్నట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లితే వారు కూడా విద్యుత్ అధికారుల వద్దకే వెళ్లాలని సూచిస్తున్నారని వాపోతున్నారు. అక్కడికి, ఇక్కడికి తిరిగేందుకు ఆటో ఖర్చులు ఎక్కువ వుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ పునరుద్ధరణకు మూడు రోజులే అని వాలంటీర్లు చెప్పడంతో వారు అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఫించన్‌దారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహిళకు చదువు ఆయుధం లాంటిది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సమాజంలో మనుగడ సాగించాలంటే మహిళకు చదువు ఆయుధం లాంటిదని వర్ధమాన సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ పేర్కొన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రామాంజనేయరెడ్డి సేవ్ గర్ల్‌చైల్డ్ ప్రాజెక్ట్‌లో భాగంగా సిద్ధార్థ చిత్రపటాన్ని చిత్రీకరించి హైదరాబాద్‌లో బుధవారం రాత్రి ఆయనకు బహూకరించారు. ఈ సందర్భంగా చిత్రకారుడు గురువారం స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ గురించి పలువురికి తెలిసేలా కృషి చేయాలన్నారు. భవిష్యత్‌లో ప్రొద్దుటూరుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఆ సందర్భంగా కలుస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ గౌరవ సలహాదారు సాదు పద్మభూషణ్, సభ్యులు నారాయణ, ఆర్టిస్ట్ కుమారి ప్రసన్న పాల్గొన్నారు.

పటాన్ని బహూకరిస్తున్న చిత్రకారుడు

శివప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివప్రసాద్, నందిని కుటుంబానికి టిడిపి నాయకులు ఆర్థిక సాయం చేశారు. స్థానిక శ్రీరాం నగర్‌లోని శివ ప్రసాద్, నందిని, జ్ఞానేశ్వర్‌లను గురువారం టిడిపి నాయకులు పరామర్శించారు. అలాగే ఖర్చుల కోసం రూ.5 వేలు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అందజేశారు. చికిత్స కోసం సహాయ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఐటిడిపి ఇన్‌చార్జ్ నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, పూల అల్లాబక్ష్, మహమ్మద్ ఇనాయతుల్లా, ఇలియాస్, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, మహబూబ్ షరీఫ్, పోతిరెడ్డి శివ పాల్గొన్నారు.

గాయపడిన వారిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సచివాలయ కన్వీనర్లుగా నియమించిన వారికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే అధ్యక్షతన మండలస్థాయి సచివాలయ కన్వీనర్ల నియామకాలకు సంబంధించి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లుగా నియమితులైన వారికి దిశానిర్దేశం చేశారు. 2024లో కూడా అధికారంలోకి రావాలంటే అందరూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలు తీర్చేలా కృషి చేయాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని బుడ్డాయిపల్లె వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. మండలంలోని తుడమలదిన్నె గ్రామానికి చెందిన నంబ్బరాయుడు, చింతకొమ్మదిన్నెకు చెందిన పోతులూరయ్య మృతి చెందినట్లు ఎస్ఐ కుళ్లాయప్ప తెలిపారు. సుబ్బరాయుడును స్కార్పియో ఢీకొందని పోలీసులు తెలిపారు. పోతులూరయ్య ఖాజీపేట నుంచి ప్రొద్దుటూరుకు వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL SENIOR CIVIL JUDGE, KADAPA
I.P.NO. 54 OF 2022

Shaik Nasir son of Shaik Jaffar Hussain, residing at D.No.15/164, Bellary Road, Kadapa City.
...Petitioner

Vs

1. C. Subbarayudu son of Subbarayudu, residing at D.No.133/365, OPP to Nehru Park, Co-Operative Colony, Kadapa City.
2. M. Satish son of M. Chandraresident of D.No. 6/137-3, BharathiBar Lane, Sankarapuram, Kadapa City.
3. Munna son of Mahaboob resident of D.No. 19/286, OPP toMunicipal Office (Old), Kadapa City.
4. P.Sunil son of Rajendra residing at B.K.M. Street, Kadapa City.
5. S. Imran son of S.Jamsheed residing at D.No.11/719, HabibullaStreet, Kadapa City.
6. A.P.G.Bank, Kadapa rep. by its Branch Manager, near KrishnaPicture palace.
7. Kala Agencies rep.by its Managing Partner, D.No. 17/587,Habibulla Street, Kadapa City.
8. V. Mallikarjuna son of V.Ramaiah resident of D.No. 17/157,Habibulla Street, Kadapa City.
9. B.Rama Mohan Reddy son of Subba Reddy resident of LemonSuper Market, I.T.I.Circle, Kadapa City.
10. S. Halyath son of Rasool, resident of Mundy Bazar, HabibullaStreet, Kadapa City.

...Respondents

GENERAL PUBLIC NOTICE

The above-named petitioner /Debtor filed the above I.P.No. 54 of 2022 against the respondents to declare him as an insolvent and todischarge him from A schedule liabilities and also for other reliefs.If the respondents or any other persons are having objections,appear before the above-named Court on 5-01-2023 at about 10.30 a.m. either in person or through your authorized counsel. Failing which the matter will be decided as exparte.

K.V. RAMANA REDDY,
ADVOCATE,
KADAPA. Mobile No.9885 202686